పడిగాపులు.. క్యూలైన్లు



దేవరకద్ర హాకా కేంద్రం వద్ద వరుసక్రమంలో నిలబడ్డ రైతులు

- యూరియా కోసం బారులుదీరిన రైతులు
- ఉదయం నుంచే షాపుల ఎదుట పడిగాపులు

దేవరకద్ర: యూరియా కోసం రైతులు ఉదయం నుంచే షాపుల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఎరువుల దుకాణాల ఎదుట రోజు కనిపిస్తున్న దృశ్యం ఇది. యూరియా కొరత కారణంగా ఎక్కడ దొరుకుతుందా అని పరుగులు తీస్తూ రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. వర్షాలు బాగా కురవడంతో వరి నాట్లు వేసుకున్న రైతులు యూరియాను వేసుకోడానికి అదను కావడంతో ప్రతి రోజూ తెల్లవారుజామునే దేవరకద్రకు చేరుకుని ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు పడే పరిస్థితి వచ్చింది. దేవరకద్రలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం కేంద్రంతోపాటు కొత్తగా ప్రారంభించిన రెండు హాకా కేంద్రాల ద్వారా గురువారం యూరియాను విక్రయించారు. దేవరకద్ర మండలానికి 5లారీల యూరియా రావడంతో దేవరకద్రలోని పీఏసీఎస్, రెండు హాకా కేంద్రాలకు కలిపి మూడు లారీల యూరియాను అలాట్ చేశారు. మరో రెండు లారీల యూరియాను నాగారం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రానికి పంపించారు. యూరియా వచ్చిన వెంటనే ఆయా కేంద్రాల వద్ద రైతులు బారులుదీరారు. స్టాక్ అయిపోయే వరకు ఒక్కో రైతుకు రెండు బస్తాలను అందించారు. వచ్చిన యూరియా కేవలం గంటలోపే అయి పోవడంతో చాలా మంది రైతులు యూరియా దొరక్క నిరాశతో వెనుదిరిగి పోయారు.



నవాబుపేట పీఏసీఎస్ ఎదుట రైతుల క్యూలైన్

ఒక్కోచోట ఒక ధర

యూరియా కొరతతో కొందరు వ్యాపారులు అదను చూసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల ద్వారా రూ.270 లకు యూరియా బస్తాను విక్రయించారు. దేవరకద్రలోని హాకా కేంద్రాల్లో ఒకచోట రూ. 280కి విక్రయించగా మరోచోట రూ.290కు విక్రయించారు. ప్రభుత్వం ద్వారా వస్తున్న యూరియాను ఇలా ఎవరికి ఇష్టం వచ్చిన ధరలకు వారు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పీఏసీఎస్‌లు, హాకా కేంద్రాలకు యూరియా కేటాయించిన వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ ధరలను నియంత్రించడంలో మాత్రం విఫలం అవుతున్నారు. హాకా కేంద్రాల వద్ద వచ్చిన వ్యవసాయ అధికారి ముందే యూరియాను అధిక ధరలకు విక్రయించినా చూసీచూడనట్లు వ్యవహరించారు.

1500 మెట్రిక్ టన్నుల యూరియా రావాలి

దేవరకద్ర మండలానికి 2850 మెట్రిక్ టన్నుల యూరియా అవసం ఉండగా ఇప్పటి వరకు 1350 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించాం. ఇంకా 1500 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. రోజువారీగా వస్తున్న యూరియాను రైతులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. హాకా కేంద్రాల వారికి ఇకనుంచి యూరియా కేటాయింపు నిలిపివేస్తాం. పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తాం.

– రాజేందర్ అగర్వాల్, మండల వ్యవసాయ అధికారి

నవాబుపేటలో క్యూలైన్..

నవాబుపేట: రైతులకు యూరియా తిప్పలు తీరడం లేదు. యూరియా కోసం మరోసారి క్యూలు కట్టారు. వరుస వర్షాలతో వరినాట్లు ముమ్మరమయ్యాయి. దీంతో గురువారం యూరియా బస్తాల కోసం పీఏసీఎస్ ఎదుట క్యూలు కట్టి బస్తాలు తీసుకున్నారు. కాగా రైతులకు కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో రోజుల తరబడి ఇదే పరిస్థితి ఉంటుందిని.. రైతులకు కావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వరదకు దెబ్బతిన్న ప్రాంతాల సందర్శన



రాందాస్‌తండా వద్ద తెగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

జెడ్పీసెంటర్/జడ్చర్ల టౌన్/భూత్పూర్: జిల్లాలో వరదల వలన దెబ్బతిన్న ప్రాంతాలను వరద రెవెన్యూ(విపత్తుల నిర్వహణ శాఖ)ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ గురువారం సందర్శించారు. దివిటిపల్లి అమరాజా ఫ్యాక్టరీకి వెళ్లే టీజీఐఐసీ కాంప్లెక్స్ వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్డు, అనంతరం భూత్పూర్ మండలం అమిస్తాపూర్ నుంచి రాందాస్‌తండా మధ్య దెబ్బతిన్న రోడ్డు, జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజీ వెళ్లే వర్షపు నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. దెబ్బతిన్న రహదారి, రైల్వే అండర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనుల గురించి కలెక్టర్ విజయేందిరబోయి, రైల్వే, మున్సిపల్, టీజీఐఐసీ అధికారులు ఆయనకు వివరించారు. అలాగే జడ్చర్ల మండలంలోని సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల జూనియర్ కళాశాల సందర్శన, విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. చిట్టిబోయినపల్లి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నరసింహారెడ్డి తదితరులు భోజనం చేశారు. గురుకుల పాఠశాలలో వంట గది, స్టోర్ రూమ్ పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని, ఈరోజు తాను వస్తున్నందుకు బాగా చేశారా.. రోజు ఇలానే ఉంటుందా అని విద్యార్థులను ప్రశ్నించారు.

కబ్జా కోరల నుంచి చెరువులను కాపాడండి

మహబూబ్‌నగర్ మండలంలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ఆక్రమణల నుంచి వాటిని విడిపించాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ మండలంలోని బారీష్‌తక్తా చెరువు, మోదంకుంట, ఎర్రకుంట, మైల్ దేవరకుంట, బస్వాయికుంట, మండలికుంట, కొత్తకుంట, కొప్పలవాని కుంట, కురలగడ్డకుంట, అమ్మసముద్రం, గురిమిల్లకుంట, ఎల్లారెడ్డికుంట, కొప్పులవాని కుంటకు చెందిన మొత్తం 131 ఎకరాలకు పైగా కబ్జాకు గురైందని వివరించారు. వెంటనే కబ్జాకు గురైన చెరువులు, కుంటల భూమిని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాకపోకలు పునరుద్ధరించాలి

వరదల వల్ల బ్రిడ్జి దెబ్బతినగా వెంటనే రాకపోకలు పునరుద్ధరించాలని విపత్తుల నిర్వహణశాఖ, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీలోని 1వ వార్డు రాందాస్‌తండాకు వెళ్లే దారిలో బ్రిడ్జికి ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి పర్యవేక్షించారు. దారివెళ్లే మార్గం, సమీప గ్రామం, జనాభా వివరాలను కమిషనర్ నూరుల్ నజీబ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ గోపాల్ నాయక్, జిల్లాస్థాయి ఇరిగేషన్ అధికారులు, సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూరియా కేంద్రం తనిఖీ



దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం యూరియా కేంద్రాన్ని గురువారం స్పెషల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు సొసైటీకి కేటాయించిన యూరియాను ఎంతమంది రైతులకు అందజేశారని అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించి రిజిష్టర్‌ను పరిశీలించారు. ఎంఆర్‌పీ ధరలకు యూరియాను విక్రయించాలని అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకద్ర: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని స్పెషల్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి మధుసూదన్ నాయక్ సూచించారు. గురువారం దేవరకద్రలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదిలో సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిపార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ దీపిక, స్వప్న, ఆర్ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.

చిల్వేర్, కేజీబీవీలో ప్రత్యేక వైద్యశిబిరాలు



మిడ్జిల్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ, చిల్వేర్‌లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. అలాగే వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు జ్వరం, దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే చిల్వేర్‌లో 30మంది టీబీ అనుమానితుల నుంచి శాంపుల్స్ సేకరించి జిల్లాకేంద్రానికి పంపించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి భాస్కర్‌నాయక్, డాక్టర్ చెన్నమ్మ, ప్రసాద్, నరేశ్, సంపత్, దేవయ్య, శ్రీదేవి, నీలమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్యపరీక్షలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కోసం జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం హాల్‌లో గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అన్నిరకాలుగా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మండల కేంద్రంలోని భవిత సెంటర్లలో వారికి రెండుసార్లు ఫిజియోథెరపి చేయిస్తున్నామని, అన్ని రకాల స్కాలర్‌షిప్‌లు వర్తించేవిధంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు బాలుయాదవ్, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఐఈఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పీయూ కార్మికులకు వసతులు కల్పించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్లు కనీస వసతులు కల్పించడం లేదని వారికి వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పీయూలో పలు భవనాల వద్ద జరుగుతున్న పనుల్లో కార్మికులు ఉన్నారని, వారికి ఉండేందుకు కనీసం గదులు, ఫ్యాన్, మరుగుదొడ్లు వంటివి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనిచేస్తున్న పనుల్లో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, వంశీకుమార్, గణేశ్, అంజనేయులు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవాబుపేట: ప్రజలు అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గుబ్బడిగుచ్చతండా, తీగలపల్లిలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజకు ఫీవర్ సర్వేతోపాటు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం గ్రామంలో నిల్వనీటిని పారబోసేలా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, శరభలింగం, రాములు తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసేదాక పోరాటం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేదాక ఉద్యోగులు పోరాటం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ అన్నారు. జీఓ 28ని రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 23వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నిర్వహించే బ్లాక్ డేను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులను కలిశారు. అనంతరం పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎఫ్‌ఆర్‌డీఏతో చేసుకున్న ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 23ను చీకటి దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. 23న జీఓ 28ని ప్రతులను జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు దహనం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షుడు బాల్‌రాజు, గండీడ్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు కుర్మయ్య, సతీశ్, రాజు, యాదయ్య, శాదర, జ్యోత్స్న, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు యూయూపీఎస్సీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు వెంకట్, డీటీఎఫ్ అధ్యక్షుడు సోమయ్య పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అందుకే మహాధర్నా తలపెట్టామన్నారు. అనంతరం మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రవీదర్‌గౌడ్, ప్రభాకర్, మహెమూద్, జలీలోద్దీన్, ఉమాదేవి, నర్సింహులు పాల్గొన్నారు.

కాజ్‌వే ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శివశక్తినగర్ కమాన్ వద్ద డ్రెయినేజీపై నిర్మించిన కాజ్‌వేను గురువారం వన్‌టౌన్ సీఐ అప్పయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లంగారి భరత్‌కుమార్, కుర్వ నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, అక్కడి మట్టిని తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



సామర్థ్యాల పెంపునకు ఉపయోగించాలి

జడ్చర్ల టౌన్: టీఎల్ఎం మేళాలలో ఉపాధ్యాయులు తీసుకొచ్చిన బోధనా పరికరాలను పాఠశాలల్లో ఉపయోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి సామర్థ్యాలను పెంచేందుకు పాటుపడాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం మేళాలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సులువైనరీతిలో పాఠాలు బోధించాలని, అందుకు తయారు చేసిన పరికరాలను ఉపయోగించాలన్నారు. మేళాలో ప్రదర్శించిన అంశాలను ఎంపిక చేసిన వాటిని అన్ని పాఠశాలలకు పంపించాలన్నారు. ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను ప్రదర్శించే ఉద్దేశంతో మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం మేళాను ప్రారంభించారు. మేళాలలో తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ విభాగాల్లో మొత్తం 64 బోధనా పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ మంజులాదేవి, హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



బోధనా పరికరాలను పరిశీలిస్తున్న డీఈఓ, చైర్‌పర్సన్, ఎంఈఓలు

పంటలపై జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు

భూత్పూర్: వానకాలంలో సాగుచేసిన పంటలపై రైతులు జాగ్రత్తలు పాటిస్తే దిగుబడులు అధికంగా సాధించవచ్చని శాస్త్రవేత్త అర్చన పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తమొల్గరలో వరినాట్లు, పత్తిపంటలను పరిశీలించారు. జూన్1 నుంచి ఆగస్టు 18వరకు సాధారణ వర్షపాతం 322.5 మిల్లీమీటర్లు ఉండగా.. ఈ ఏడాది 589.3 మి.మీ నమోదు కావడంతో రైతులు సాగుచేసిన పత్తి, కంది, మొక్కజొన్న పంటలపై జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వరిలో అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు ఆశించకుండా గాట్లను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పత్తిపంటలో శాకీయ దిశ నుంచి పూత పిందే అభివృద్ధి దిశలో ఉందన్నారు. పొలంలో నీరు నిల్వ ఉంటే తీసివేయాలని, పంట త్వరగా కోలుకోవడానికి పాలిఫిడ్(19:19:19), మల్టీ-కే (13-0-15), యూరియాలో ఒక లీటర్ నీటిని కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి 3సార్లు పిచికారీ చేయాలని సూచించారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మాచన్‌పల్లిలో అధిక వర్షాల వల్ల వరి, పత్తి, జొన్న, కంది పంటలను తెగుళ్ల బారినుంచి కాపాడుకునేందుకు జాగ్రత్తల గురించి ఆర్ఏడబ్ల్యూఈపీ అగ్రికల్చర్ విద్యార్థులు గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏ విధమైన చర్యలు తీసుకుంటే ఆ పంటలను కాపాడుకోవచ్చనే విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, ఏఈఓ హనీఫ్, రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాచన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

భారీగా గుంతలు.. భయంగా రాకపోకలు

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి శివారులోని రాయపల్లికి ఉన్న రెండున్నర కిలోమీటర్ల బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిని పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. దీంతో ప్రతిరోజూ ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. అడుకోగుంత ఈ రోడ్డుపై ప్రయాణించేదెట్ల అంటూ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా సమీపంలోని సెజ్‌లోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు రాత్రివేళల్లో గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాద భరితంగా ఉన్న గుంతలకు సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా ఏర్పడ్డ రాయపల్లి రోడ్డు

పోచమ్మ తల్లి.. అందించు దీవెనలు



పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షిణలు



బంగారు మైసమ్మకు బోనాలతో మహిళలు

నవాబుపేట: మండల కేంద్రంలో గురువారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని వేపాకులతో అలంకరించారు. బోనాల ఊరేగింపునకు శివాలయం, హనుమాన్ ఆలయాల చెంత గ్రామపెద్దలు బోనాలకు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు వైభవంగా జరిగింది. మండల కేంద్రంలో జరిగే బోనాల పండగకు ప్రజలకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి వంట సరుకులను అందించారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలు

రాజాపూర్: రాజాపూర్ శివారులోని దుందుభీ వాగు ఒడ్డున కొలువైన బంగారు మైసమ్మ బోనాలను గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయానికి గ్రామానికి చెందిన యాదవులు పెద్ద ఎత్తున చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. గ్రామస్తులు, యాదవులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మకు బోనం

మిడ్జిల్: మండల పరిధిలోని మసిగొండ్లపల్లిలో గురువారం బంగారు మైసమ్మ బోనాలను ఘనంగా జరుపుకొన్నారు. ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో వెళ్లి గ్రామదేవతకు నైవేద్యం సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

నేడు రూ.4కోట్ల పనులు ప్రారంభం

నవాబుపేట: ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో శుక్రవారం మండలంలో దాదాపు రూ.4కోట్ల పనులను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పనుల జాతర సందర్భంగా శుక్రవారం జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. బట్టోనిపల్లితండాలో రెండున్నర కోట్ల సీసీరోడ్డు పనులతోపాటు నవాబుపేట, తీగలపల్లి, జంగమయ్యపల్లి, కొల్లూర్, లోకిరేవు, ఇప్పటూర్‌లో కోటిన్నర రూపాయల విలువైన సీసీరోడ్డు పనులను ప్రారంభించనున్నారు. అనంతరం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందిస్తారని వివరించారు.

పనుల జాతర

మిడ్జిల్: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలో మంజూరైన పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి హాజరవుతారని అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొనాలని సూచించారు.

ఉమ్మడి మండలంలో ఎమ్మెల్యే పర్యటన

మహమ్మదాబాద్/గండేడ్: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ గండేడ్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని వివరించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యూజీడీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీకేరెడ్డి కాలనీలోని దర్గా లైన్ లో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులను గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఈ పనులు నాణ్యంగా, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

రేపు ఈశా గ్రామోత్సవం వాలీబాల్ పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఈశా గ్రామోత్సవం పురుషుల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు వాలీబాల్ పోటీలు ప్రారంభమవుతాయని, ముఖ్య అతిథిగా ఎస్పీ జానకి హాజరవుతారని పేర్కొన్నారు. 2004నుంచి సద్గురు ఈశా గ్రామోత్సవం క్రీడా పోటీలు ప్రారంభించినట్లు తెలిపారు.

ముసురుకు కూలిన ఇళ్లు



భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గరలో ఇటీవల కురిసిన వర్షాలకు ఐదు ఇళ్లు కూలిపోయాయి. కొన్ని పాక్షికంగా కూలగా రెండు పూర్తి కూలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి తమకు గూడు కల్పించాలని గ్రామానికి చెందిన మూర్తయ్యగౌడ్, శ్రీనివాసులుగౌడ్, కాశన్నగౌడ్, తమ్మన్న, నాగరాజుగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



చిన్నచింతకుంట: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ సూచించారు. గురువారం చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన గణేశ్ మండపాల నిర్వాహకులకు శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలను గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీజేలు, స్పీకర్లు పెట్టి ఇతరులకు అటంకాలు కల్గించే విధంగా వ్యవహంచరాదని తెలిపారు. మండపాల వద్ద లడ్డు, హుండీల విషయాల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో మత విద్వేశాలు, రెచ్చగొట్టే వాఖ్యలతో పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అనుమతి తప్పనిసరి

హన్వాడ: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీకోవాలని ఎస్ఐ వెంకటేశ్ సూచించారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ పార్టీల నాయకులు, యువకులతో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై నిబంధనలను వివరించారు. నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు.

చిన్నారులకు ఔషధ చుక్కలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూటౌన్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం వద్ద గురువారం 16ఏళ్లలోపు చిన్నారులు 98మందికి కంటి వైద్యుడు భరద్వాజ నారాయణరావు ఔషధ చుక్కలు వేశారు. పాలమూరు ఆప్టే స్మారక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు రాంప్రసాద్, దేవేందర్‌రాజు, వసంతపు వెంకటేశ్వర్లు, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.